క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కురుపాం: మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. రెండు ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక జీసీసీ స్టాకిస్ట్ పాయింట్‌కు తరలించారు. 40 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు తెలిపారు. స్థానిక రేషన్ డిపోల్లో తనిఖీలు చేపట్టగా నిత్యావసర నిల్వలకు, రికార్డుల్లో నమోదుకు తేడాలు ఉండడంతో విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు.

ఇంటర్న్‌షిప్‌తో ప్రయోజనం



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: ఇంటర్న్‌షిప్ ప్రొగ్రాంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం అన్నారు. ఇదే విషయమై కళాశాలలోని డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులతో శుక్రవారం సమావేశమైన ఆమె డిగ్రీ పూర్తి కావస్తున్న విద్యార్థులు ఖచ్చితంగా 10 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు సమగ్ర నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని, డిగ్రీ అనంతరం ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఇది దోహదపడుతుందన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని పెద్దూరు గ్రామంలో బిడ్డిక సూర్యారావు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం కలిసి, పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అక్కడి నుంచి కింద్రువాడ వెళ్లిన ఎమ్మెల్యే సవర లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం లక్ష్మణ్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పక్కాగా ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వార్షిక ఆడిట్ శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు స్టేట్ ఆడిట్ మేనేజర్లు సాంబశివరావు, జయకృష్ణ మండలంలోని గ్రామైక్య సంఘాల వారీగా ఆడిట్ చేపట్టి, సంఘాలకు మంజూరైన నిధులు, డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలు, వాటి రికవరీలు, వీఓఏలకు చెల్లించిన జీతభత్యాలపై ఆరాతీశారు. ఏపీఎం ఆదయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు గ్రామైక్య సంఘాల్లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈ ఆడిట్ జరిగినట్లు పేర్కొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

కురుపాం: మండల కేంద్రంలో డెంగీ నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కురుపాం సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి, దోమల ద్వారా ఏయే వ్యాధులు ఏ విధంగా వ్యాప్తి చెందుతాయి.. వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో మాదలింగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సుప్రియా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

అర్హతే ప్రామాణికం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నబగ్గ కాలనీలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే ఆయన అభిమతమన్నారు. అందుకే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రాలు, నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదని, ప్రజలు గమనించాలన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వారం వ్యవధిలోనే పథకం అందుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వానికి ఎక్కడ మంచిపేరు వస్తుందోనన్న అక్కసుతోనే చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే ప్రజలే పవన్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీల అక్రమాలను ఏనాడైనా ప్రశ్నించావా?

- జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తీరుపై ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు మండిపాటు



సీతంపేట: పవన్ తీరును ఖండిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నేతలు



వీరఘట్టం:మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ నాయుడు

వీరఘట్టం: జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ తీరుపై ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు మండిపడ్డారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన వారాహి యాత్రలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్ రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం ఎంతమాత్రం తగదన్నారు. ఎప్పుడూ అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తా.. ప్రశ్నిస్తా.. అని అంటున్న పవన్ 2024 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాలను ఏనాడైనా ప్రశ్నించావా అని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీ సభ్యుల వల్ల లంచం లేనిదే ఎక్కడా అభివృద్ధి పని జరిగేది కాదని, అర్హులెవరికీ పథకాలు అందేవి కావన్నారు. ఇవన్నీ పవన్ కళ్లకు కనబడలేదా అని దుయ్యబట్టారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు పథకాలు అందించడం జరుగుతోందన్నారు. వీటికి దేశ వ్యాప్తంగా మంచి పేరుంది. కొన్ని రాష్ట్రాలు వాటిని తమ రాష్ట్రంలో అమలు చేసేందుకు సన్నాహాలు కూడా చేస్తున్నారన్నారు. అటువంటి వ్యవస్థలపై పవన్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. వలంటీర్లకు పవన్ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు..

సీతంపేట: చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. స్థానిక పట్టణంలో విలేకరులతో మాట్లాడిన వారు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న పవన్ తీరును ఖండించారు. వలంటీర్లను మానక అక్రమ రవాణా చేసేవారిగా, బ్రోకర్లుగా, ప్రజల డేటా చోరీ చేసే వారిగా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారానే ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడం సాధ్యమవుతోందన్నారు. కరోనా విపత్తు కాలంలో ప్రాణాలకు తెగించి, ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పనిచేయడం వల్లే కరోనా తీవ్రత లేకుండా చేయగలిగామన్నారు. అటువంటి ప్రజా సేవకులపై నిందలు వేయడం ఏ మాత్రం తగదన్నారు. పవన్ తీరు మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హితవుపలికారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, ఎంపీటీసీ మంగయ్య, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీడి, మామిడి మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలు అందజేస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: స్థానిక హార్టీకల్చర్ నర్సరీలో రైతులకు జీడి, మామిడి మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ వీటిని అందజేసినట్లు ఎంపీడీఓ కె.సత్యం పేర్కొన్నారు. 670 ఎకరాల్లో పండ్లతోటల సాగుకు 46 వేల జీడి, మామిడి తదితర మొక్కలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓలు బాబురావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

భామిని: మండలంలోని నేరడి–బి గ్రామ సచివాలయంలో ఇటీవల బదిలీపై వెళ్లిన వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు సుధారాణి, డీఏ భాస్కరరావును శుక్రవారం సన్మానించారు. ప్రజాసమస్య పరిష్కారంలో వారు చేసిన విశేష కృషిని ప్రశంసించి, జ్ఞాపికలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, మంచిపేరు తెచ్చుకోవాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి లోవ అనసూయ, ఏఎన్ఎం నీరజ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



భుముల రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ రూరల్: భూముల రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య అన్నారు. స్థానిక పట్టణ శివారు ప్రాంతంలోని తోటల్లో చేపడుతున్న రీసర్వేను శుక్రవారం పరిశీలించిన ఆయన రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్‌ఓలు బి.సాయిశ్రీనివాస్, రామారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్లు అందుకున్న యువతతో ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆకాంక్షించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి స్పాన్సర్ చేసిన 40 వాలీబాల్ కిట్లను మండలంలోని చిన్నబగ్గ కాలనీలో యువతకు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ఉదయం, సాయంత్రం ఆటలు ఆడి ఆరోగ్యవంతంగా ఉండాలని తెలిపారు.

స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలి

గుమ్మలక్ష్మీపురం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తీరుపై మండిపడిన రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిపై ఆరోపణలు చేసిన ఇరిడి ఎంపీటీసీ, జనసేన నేత కద్రక మల్లేశ్వరరావు తన స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ గొరిశెట్టి గిరిబాబు అన్నారు. మండల కేంద్రంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందేలా పనిచేస్తున్న వలంటీర్ల గురించి, ప్యాకేజీ స్టార్ తప్పుగా మాట్లాడడం ఏమాత్రం సరికాదన్నారు. మానవ అక్రమ రవాణాదారులుగా, ప్రజల డేటా ఇతరులకు తెలియజేసేవారుగా వలంటీర్‌లను ఉద్దేశించి, ఆయన చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమన్నారు. అటువంటి పవన్‌ను సమర్థిస్తూ ఆ పార్టీ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వలంటీర్ల సేవలు కళ్లముందే కనబడుతున్నా వారిపై ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. గిరిజన జేఏసీ అని, గిరిజనులను మభ్యపెట్టి ఎంపీటీసీగా పదవి పొందావే తప్ప జనసేన పార్టీ గుర్తుతో ఎంపిక కాలేదన్న సంగతిని గుర్తుంచుకోవాలన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏలో ఇంజినీర్లతో సమావేశమైన ఆమె పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో నిర్మాణ దశలోని రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అలాగే గిరిజన గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈలు కృష్ణకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై దర్యాప్తు



గొడగల వీధిలో మ్యాపుల ఆధారంగా అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలోని గొడగల వీధి నుంచి జగన్నాథస్వామి ఆలయ సమీపంలోని స్వామి వారి ఉత్సవ రథం వరకు ఆక్రమణలు చోటుచేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అప్రమత్తమైన రెవెన్యూ శాఖ అధికారులు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు నేతృత్వంలోని ఓ బృందం శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి, పరిశీలించి, దర్యాప్తు చేసింది. మ్యాపుల ఆధారంగా అక్కడ చేస్తున్న కట్టడాలు, గ్రామకంతాలను పరిశీలించారు. తాము సేకరించిన వివరాలను విజిలెన్స్, ఉన్నతాధికారులకు అందజేస్తామని బృంద సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్‌ఓలు బలివాడ సాయిశ్రీనివాస్, జయసుధ, బి.వెంకటరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: నిరుపేద గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సహాయ కార్యదర్శి టి.జీవన్న కోరారు. ఇదే విషయమై వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీలో ఖాళీగా ఉన్న స్థలంలో మౌలిక సదుపాయాలకు దూరంగా జీవిస్తున్న 15 గ్రామాల గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఇదే అంశం మీద పోరాటం చేస్తుంటే జేకే పాడు గ్రామానికి చెందిన గిరిజనులు కొంతమంది తమతో అనవసరంగా గొడవలకు దిగుతున్నారని, తమతో పోరాటంలో పాల్గొన్న గిరిజనులపై బైండోవర కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టిన, బెదిరింపులకు పాల్పడినా గిరిజనులకు ఇళ్ల స్థలాలు సాధించి, తీరుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, లింగరాజు, జిల్లా సభ్యులు పువ్వల ప్రసాద్, సింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

వీరఘట్టం:

రైతులంతా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హాజరైన ఆయన గతేడాది ఖరీఫ్‌లో అధికారుల పనితీరు వల్ల చోటుచేసుకున్న కొన్ని పరిస్థితుల వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని, ఈ ఏడాది అటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ప్రతీ రైతుతో ఈకేవైసీ చేయించాలని, విపత్తులు వచ్చేటప్పుడు జరిగే పంటనష్టాన్ని పారదర్శకంగా నమోదు చేసి, రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, వ్యవసాయాధికారులు శ్రీనివాస్, శారద, రత్నకుమారి, జె.సౌజన్య, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం: రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

భామిని: స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు మాట్లాడుతూ రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించాలని కోరారు. సమావేశంలో సీతంపేట హెచ్‌టీఓ జయశ్రీ, మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం, వైఎస్సార్ సీపీ నేత బొడ్డేపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మండల వ్యవసాయాధికారి పలు సూచనలు చేశారు.

రైతులకు ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదుపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాశరావు, వాకముడి అనీల్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శాసుబిల్లి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ నివారణే లక్ష్యం



పాఠశాలలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

- చురుగ్గా రెండో విడత దోమలమందు స్ప్రేయింగ్
- పార్వతీపురం మన్యం జిల్లాలో 280 గ్రామాల్లో నిర్వహణ
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- అప్రమత్తమైన మలేరియా నివారణ శాఖ

సీతంపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా మలేరియా, డెంగీ వ్యాధుల నివారణే లక్ష్యంగా జగనన్న సర్కారు అడుగులు వేస్తోంది. శనివారం నుంచి ప్రారంభమైన రెండో విడత దోమల మందు స్ప్రేయింగ్ ఈ నెలాఖరు వరకు 280 గ్రామాల్లో చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 246 మలేరియా కేసులు, మరో 99 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో మలేరియా నివారణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మొదటి విడతలో ఐఆర్ఎస్ 5 శాతం, అల్ఫా సైపర్‌మెత్రిన్ మందును గ్రామాల్లో స్ప్రేయింగ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో స్ప్రేయింగ్ చేశారు. రెండో విడతలో కూడా ఇదే మందును పిచికారీ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్ వరకు మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుంది. ఇదే కాలంలో వర్షాలు కూడా కురవనుండడంతో నీరు నిల్వ ప్రాంతాల్లో దోమలు అధికంగా పెరుగుతాయి. వీటి ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి రోగాలు విజృంభిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అధికారులు పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టి, వ్యాధులు వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో మురుగు కాలువల్లో గంబూషియా చేపలు వేసి, దోమల లార్వాలు పెరగకుండా చేశారు.

అందుబాటులో నిర్ధారణ పరీక్షలు..

అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ఆర్‌డీటీ(ర్యాపిడ్ డయోగ్నస్టిక్ కిట్స్) అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా మలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించి, అవసరమైన మందులు, చికిత్స అందజేయడం జరుగుతుంది. కొన్నిచోట్ల నిర్వహించే వైద్య శిబిరాల ద్వారా ఈ పరీక్షలు కూడా చేసి, మలేరియా నివారణకు కృషి చేస్తుండడం విశేషం. చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు కూడా ముమ్మరం చేసి, దోమల నివారణకు వైద్యారోగ్య సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లోని 3,54,669 దోమతెరలు పంపిణీ చేశారు. అలాగే వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే..



ఇంటింటా ఫీవర్ సర్వే ముమ్మరం చేశాం. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధిగ్రస్తులను గుర్తించి, అవసరమైన చికిత్స, మందులు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. దోమతెరల వాడకం, వ్యాధుల నివారణ చర్యలపై ఎప్పటికప్పుడు అవగాహన ర్యాలీలు చేపట్టి, చైతన్యం కలిగిస్తున్నాం.

–విజయపార్వతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, సీతంపేట.



కుడ్డపల్లిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు

75 శాతం రాయితీపై పశుగ్రాసం విత్తనాలు

గరుగుబిల్లి: పాడిరైతులకు 75 శాతం రాయితీతో పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చిలకాం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పాడిపరిశ్రమలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు పెంపకంలో పశుగ్రాసంతోనే అధిక పాల దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం పశుగ్రాస క్షేత్రం సందర్శించి, ప్రతీ రైతు పశుగ్రాసం పెంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ అధికారి ప్రసాద్, గరుగుబిల్లి ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.